క్లుప్తంగా

ఘనంగా ఎమ్మెల్సీ బొత్స జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు

మద్దిలపాలెం : శాసనమండలి సభ్యులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ జన్మదినం సందర్భంగా విశాఖ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో సీతమ్మధార రాధాక్రిష్ణ కళ్యాణ మండపంలో బుధవారం కేక్ కట్ చేశారు. వేడుకల్లో రాష్ట్ర కార్యదర్శి రవిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ముమ్వల సురేష్, రాష్ట్ర మత్స్య శాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పేర్ల విజయ్ చందర్, ఉమ్మిడి దాసు, బోని శివరామకష్ణ, దేవరకొండ మార్కండేయులు, పీలా ప్రేమ్, వాసుపల్లి యల్లాజీ, పీతల గోవింద్, మక్బూల్, పులగం శ్రీనివాస రెడ్డి, మధుపాడ రవి, పతివాడ కనక రాజు, బోండా శ్రీను, హేమంత్, మగడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలతో దేశ అభివృద్ధి



ప్రసంగిస్తున్న ఆచార్య బీవీ మురళీధర్

మద్దిలపాలెం : దేశ అభివృద్ధికి సామాజిక శాస్త్రాల అధ్యయనం, పరిశోధనలు ఎంతో దోహదపడతాయని ఆచార్య బి.వి.మురళీధర్ అన్నారు. ఏయూ రాజనీతి శాస్త్ర విభాగాధిపతి ఆచార్య ప్రేమానందం ఆధ్వర్యంలో బుధవారం బహుళ విభాగాల పరిశోధనలో వినూత్న దిశలు అనే అంశంపై అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య మురళీధర్ ప్రసంగిస్తూ ప్రభుత్వాలు ఇలాంటి పరిశోధనలు జరిపించాలని సూచించారు. వీటికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. సామాజిక శాస్త్రంతోపాటు అన్ని రంగాల్లో పరిశోధనలు జరిగితే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని అభిప్రాయపడ్డారు.

భోజనం ప్యాకెట్ల పంపిణీ



భోజనం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న శివరామకృష్ణ

ఎంవీపీ కాలనీ : శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ జన్మదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ నాయకులు నగరంలో భోజనం ప్యాకెట్లు బుధవారం పంపిణీ చేశారు. పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామ కృష్ణ, విశాఖ జిల్లా ఎంప్లాయిస్, పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడు దేవరకొండ మార్కండేయులు ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ, మద్దిలపాలెం, రైల్వేస్టేషన్, బీచ్‌రోడ్, సిరిపురం, ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఆహారం ప్యాకెట్లు పంపిణీ చేశారు.

మావోయిస్టులకు ఐజీ హెచ్చరికపై పౌర సంఘాల ఆగ్రహం

అల్లిపురం: బస్తర్ ఐజీ సుందర్ రాజ్ మావోయిస్టులను ఉద్దేశించి చేసిన 'లొంగిపోండి లేదంటే చంపేస్తాం' అనే ప్రకటనను పౌర ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండించాయి. బుధవారం అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పౌర సంఘాల నాయకులు ఈ వ్యాఖ్యలు చేశారు. పౌర సంఘాలు నేతలు మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం చేపడుతున్న హత్యాకాండను ఆపాలని, ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని, మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశాయి. ఆదివాసీ నిరసన శిబిరాల్లో ఉన్నవారిని సైతం మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయనే పేరుతో కాల్చి చంపుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీ ప్రాంతాల్లో కనీసం బస్సులు కూడా లేని చోట ఆరు లైన్ల రోడ్ల నిర్మాణం చేపట్టి, 350కి పైగా భద్రతా క్యాంపులను పెట్టి ఆదివాసుల భూములను లాక్కుంటున్నారని, విద్య, వైద్యం, సంతల నిర్వహణ లేకపోవడం వంటి అనేక విధాలుగా వారిని నిర్బంధిస్తున్నారని పౌర సంఘాలు ఆరోపించాయి. ఆదివాసీలు పోరాడి సాధించుకున్న ఫిఫ్త్ షెడ్యూల్, అటవీ సంరక్షణ చట్టం 2006, పంచాయతీ రాజ్ ఎక్స్‌టెన్షన్ యాక్ట్ (పీసా యాక్ట్) వంటి అన్ని చట్టాలను ప్రభుత్వం బుట్టదాఖలు చేసిందని ఆరోపించారు. అడవుల నుండి ఆదివాసీలను బయటకు గెంటే కుట్రను ప్రభుత్వం చేపడుతోందని, ఈ కుట్రలను 'ఆపరేషన్ కగార్' పేరుతో చేస్తున్న నరహంతక మారణకాండను అభ్యుదయవాదులు, ప్రజలు, ప్రజాస్వామికవాదులు ఖండించాలని పౌర ప్రజా సంఘాల వేదిక డిమాండ్ చేసింది. కార్యక్రమంలో పౌర ప్రజా సంఘాల సమన్వయకర్త పాత్రపల్లి చంద్రశేఖర్, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అత్తిలి విమల పాల్గొన్నారు.

భక్తజన సందోహం

- మార్మోగిన నారసింహ నామస్మరణ
- భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ
- కిటకిటలాడిన బీఆర్‌టీఎస్ రోడ్డు



ప్రసాదం పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మొల్లి అప్పారావు



బీఆర్‌టీఎస్ రోడ్డులో ఉత్సాహంగా గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు



హనుమంతవాక సమీపంలో శ్రీవరాహ లక్ష్మీ నృసింహ స్వామి రథంతో ముందుకు సాగుతున్న భక్తులు

ఆరిలోవ : అప్పన్న గిరి ప్రదక్షిణ భక్తులతో శనివారం బీఆర్‌టీఎస్ రోడ్డు కిటకిటలాడింది. ఉదయం 7 గంటలకే భక్తులు నడక ప్రారంభించారు. ఎండను సైతం లెక్కచేయక సింహాద్రి అప్పన్నపై తమ భక్తి చాటుకోవడానికి సిద్ధమయ్యారు. కొండల నీడకు తోడు కొందరు తలపై తువ్వాళ్లు వేసుకుని గిరి ప్రదక్షిణ సాగించారు. స్వామి నామస్మరణ చేసుకుంటూ అప్పన్న కొండను అవలీలగా చుట్టేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి భక్తుల తాకిడి పెరిగింది. దీంతో బీఆర్‌టీఎస్ రోడ్డులో అన్ని లైన్‌లు అడవివరం నుంచి హనుమంతవాక వరకు గిరి భక్తులతో నిండిపోయి సందడిగా మారిపోయాయి. హనుమంతవాక నుంచి విశాలాక్షినగర్ మీదుగా జోడుగుళ్లపాలెం, తెన్నేటి పార్కు, అప్పుఘర్ వరకు బీచ్‌రోడ్డు, అక్కడి నుంచి ఎంవీపీ కాలనీ, వెంకోజీపాలెం, హెచ్‌బీ కాలనీ మీదుగా సింహాచలం వరకు భక్తులు నడక సాగించారు. వయసుతో సంబంధం లేకుండా వృద్ధులు, పిల్లలు, యువకులు ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు భక్తులు రోడ్లపై పలచగా కనిపించినా ఆ తర్వాత నుంచి రోడ్లు కిటకిటలాడాయి. గొడుగులు వేసుకున్న భక్తుల మధ్యలో వాహనాలు వెళ్లడానికి వీలులేని పరిస్థితి నెలకొంది. అడవివరం నుంచి హనుమంతవాక మీదుగా జోడుగుళ్లపాలెం వరకు ఎక్కడ చూసినా గిరి ప్రదక్షిణ భక్తుల సందడే కనిపించింది. దారి పొడవునా స్వచ్ఛంద సంస్థలు అందించిన ప్రసాదం భక్తులు తింటూ ఆకలి తీర్చుకొని అప్పన్న నామస్మరణతో బీఆర్‌టీఎస్, బీచ్ రోడ్లలో హోరెత్తించారు. లక్షల మంది భక్తులు కావడంతో ఈ రోడ్లన్నీ నిండిపోయాయి. జిల్లా కలెక్టర్, జీవీఎంసీ అధికారులు, నగర పోలీస్ కమిషనర్, డీసీపీలు, ఏసీపీలు నిరంతరం పర్యవేక్షించారు.



గిరి ప్రదక్షిణలో గిరిజన భక్తులు

అడుగడుగునా ఆంక్షలే...

గిరిప్రదక్షిణ కోసం హనుమంతవాక వైపు నుంచి ఆటోలలో వెళ్లే భక్తులను పోలీసులు ముడసర్లోవ వద్ద నిలిపేశారు. ఆ ఆటోలను వెనుకకు మళ్లించారు. ఆటోలలో వెళ్లిన భక్తులను అక్కడి నుంచి ప్రైవేట్, దేవస్థానం బస్‌లను అడవివరం వరకు ఏర్పాటు చేశారు. దీంతో ముడసర్లోవ డంపింగ్ యార్డు రోడ్డు పార్కింగ్‌గా మారిపోయింది. వేలాది ద్విచక్ర వాహనాలు ఇక్కడ నిలిపారు. ఉదయం 8 గంటల నుంచి దీన్‌దయాల్‌పురం (స్కిల్ డెవలప్‌మెంట్) కూడలి వద్ద ఆరిలోవ నుంచి వచ్చే వాహనాలను నిలిపేశారు. ఇక్కడ ఎలాంటి వాహనాలు బీఆర్‌టీఎస్‌లోకి ప్రవేశించకుండా పోలీసులు ఆంక్షలు విధించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి పెదగదిలి, చినగదిలి కూడళ్లలో వాహనాలు బీఆర్‌టీఎస్‌లోకి ప్రవేశించ కూడా ఆంక్షలు విధించారు. దీంతో జాతీయ రహదారి నుంచి డెయిరీఫారం, ఆదర్శనగర్, రవీంద్రనగర్, తోటగరువు మీదుగా ఆరిలోవ చేరుకోవాల్సి వచ్చింది. గిరి భక్తులకు ప్రసాదం పంపిణీ చేసే స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వారి సామాన్లు సైతం రోడ్డుపై పాయింట్ల వద్దకు తీసుకెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడంపై స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అసంతృప్తికి గురయ్యారు. కొందరు పోలీసులను గంటల తరబడి బతిమలాడుకుని స్టాళ్ల వద్దకు చేరాల్సి వచ్చింది.



భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న మాజీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి, శ్రీనివాస్

స్వచ్ఛంద సంఘాల ప్రసాద వితరణ

భక్తుల ఆకలి తీర్చడానికి దాతలు ముందుకొచ్చారు. జీవీఎంసీ, సింహాచలం దేవస్థానం అధికారులు పలుచోట్ల తాగునీరు, మందులు, సరఫరా చేశారు. పైనాపిల్ కాలనీ నుంచి జోడుగుళ్లపాలెం వరకు పలు స్వచ్ఛంద సేవా సంస్థలు, గ్రామ సంఘాలు, వివిధ ఆలయాల నిర్వాహకులు, పలు రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం, పులిహోర, మంచినీరు, మజ్జిగ, టీ, చక్కెర పొంగలి, శనగలు, బూరెలు, బజ్జీలు పంపిణీ చేశారు. విశాఖ కేంద్ర కారాగారం వద్ద జైల్, ఏపీఎస్పీ బెటాలియన్ సిబ్బంది సంయుక్తంగా స్టాల్ నిర్వహించారు. ఇక్కడ పులిహోర, శనగలు, బిర్యానీ, టీ, తాగునీరు సరఫరా చేశారు. ముడసర్లోవ వద్ద మామిడి తోటలో విశ్వాస్ సంస్థ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, పరమాన్నం, తాగునీరు, మందులు అందజేశారు. ముడసర్లోవ వద్ద ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ పులిహోర, మంచినీరు, ఆరిలోవ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుమారు 2000 మందికి పైగా భక్తులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఇదే ప్రాంతంలో ఆరిలోవ మెడికల్ షాపుల అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు మిరియాల పాలు, మందులు, తాగు నీరు సరఫరా చేశారు. చినగదిలిలో నార్త్ షిరిడీ సాయిబాబా ఆలయంలో భక్తులకు మధ్యాహ్నం, రాత్రి అన్న సమారాధన నిర్వహించారు. నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో మంచినీరు, ఉప్మా, పులిహోరా పంపిణీ చేశారు. దీంతోపాటు పెదగదిలి, హనుమంతవాక, విశాలాక్షినగర్‌లో కైలాసగిరి కూడలి, జోడుగుళ్లపాలెం, తెన్నేటి పార్కు ప్రాంతాల్లో స్వచ్ఛంద సేవా సంఘాలు, రాజకీయ నాయకుల స్టాళ్లు ఏర్పాటు చేసి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశాయి.

➡ సింహాచలం వరహా లక్ష్మీ నృసింహ స్వామి గిరప్రదక్షిణ భక్తులకు మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, గొలగాని శ్రీనివాస్ దంపతులు పెద్ద ఎత్తున ప్రసాదం పంపిణీ చేశారు. చినగదిలి ప్రాంతంలో ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేసి వేలాది మంది భక్తులకు ప్రసాదం అందించారు. భక్తులకు పులిహోర, చెక్కర పొంగలి, భోజనాలు ఏర్పాటు చేశారు.

మజ్జిగ పంపిణీ చేసిన క్రెడాయ్

విశాఖ సిటీ : సింహాచలం గిరి ప్రదక్షిణ చేసే భక్తులకు క్రెడాయ్ విశాఖపట్నం యువజన, మహిళా విభాగం విశాలాక్షినగర్ ప్రాంతంలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేసింది. వేల సంఖ్యలో భక్తులు చల్లటి మజ్జిగ తాగి ఆ శిబిరం వద్ద కొంత సేపు సేద తీరి మళ్లీ తమ ఆధ్యాత్మిక ప్రయాణాన్ని కొనసాగించారు. గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులకు సహాయంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు క్రెడాయ్ ప్రతినిధులు తెలిపారు.

లక్ష కర్పూరం బిళ్లలతో అఖండ హారతి

మద్దిలపాలెం : సింహాద్రి అప్పన్నను స్మరించుకుంటూ సింహాచలం కొండ చుట్టూ బుధవారం గిరి ప్రదక్షిణ చేసిన భక్తులకు పలు స్వచ్ఛంద సంస్థలు చేయూత అందించాయి. మంచినీరు, ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. కొంత మంది ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అవసరమైన వారికి వైద్య సేవలు అందజేశారు. ఎంఎంటీసీ త్రిముఖ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఓ ప్రైవేట్ సంస్థ ఆధ్వర్యంలో లక్ష కర్పూరం బిళ్లలతో అఖండ హారతి వెలిగించారు. భక్తులు ఇక్కడ హారతి తీసుకుని ముందుకు సాగారు. మరోవైపు భక్తులకు అవసరమైన సౌకర్యాలను జీవీఎంసీ కల్పించింది. కొత్త వెంకోజీపాలెం శివాలయం వద్ద తాత్కాలిక



త్రిముఖ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద హారతి తీసుకుని వెళ్తున్న భక్తులు

మరుగుదొడ్లు, హెచ్‌బీ కాలనీ జంక్షన్‌లో విద్యుత్ లైట్లు, మంచినీరు ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య సిబ్బంది రోడ్లను శుభ్రం చేశారు. కొత్త వెంకోజీపాలెం జాతీయ రహదారిపై భక్తులు రోడ్డు దాటేందుకు వీలుగా పోలీసులు ట్రాఫిక్ ఆపి జాగ్రత్తలు తీసుకున్నారు.



హైదరాబాద్ నుంచి వచ్చి పైనాపిల్ కాలనీ వద్ద భక్తులకు టిఫిన్ పంపిణీ చేస్తున్న సభ్యులు



గిరి ప్రదక్షిణ భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న క్రెడాయ్ విశాఖపట్నం ప్రతినిధులు



విశాలాక్షినగర్‌లో భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు



భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న పీవీఆర్ ప్రాపర్టీస్ ప్రతినిధులు

ప్రభుత్వ మోసాలను ప్రజలకు తెలియజేయాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు

- "బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ"పై ప్రతీ గడపకూ తెలపాలి
- వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం రేపు
- తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు

మద్దిలపాలెం : "బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ"పై విశాఖ తూర్పు నియోజకవర్గంలో ప్రతీ గడపకూ వెళ్లి తెలియజేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు పిలుపునిచ్చారు. ఈ విషయంలో క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యకర్తలు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. సీతమ్మధార రాధాక్రిష్ణ కల్యాణ మండపంలో నియోజకవర్గ కార్పొరేటర్లు, ఇన్‌చార్జిలు, అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లి అప్పారావు మాట్లాడుతూ ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసపూరిత పాలనను ప్రజలకు తెలియజేసేందుకు "బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ" అనే కార్యక్రమంతో ప్రతీ గడపకు వెళ్లాలని కోరారు. కార్యక్రమ షెడ్యూల్‌లో భాగంగా ఈ నెల 11న ఉదయం 9 గంటలకు మద్దిలపాలెంలోని జిల్లా కార్యాలయంలో వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ముమ్వల సురేష్, రాష్ట్ర మత్స్య శాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పేర్ల విజయ్‌చందర్, ఉమ్మిడి దాసు, బోని శివరామక్రిష్ణ, దేవరకొండ మార్కండేయులు, పీలా ప్రేమ్, వాసుపల్లి యల్లాజీ, పీతల గోవింద్, మక్బూల్, పులగం శ్రీనివాస రెడ్డి, మధుపాడ రవి, పతివాడ కనకరాజు, బోండా శ్రీను, హేమంత్, మగడ రమేష్, కమల్, సత్యాల వెంకట్, శిరీష, సాగరిక, ఇమంది సత్యనారాయణ, మరియదాసు, మెట్ట సూర్యనారాయణ, చొల్లంగి నాగేశ్వరరావు, శరగడం వేణుగోపాలరెడ్డి, ప్రదీప్, సుబ్రమణ్యం, నీలారెడ్డి, పిల్లా సత్యవతి, సీరపు రవి, శ్రీనివాసరావు, ఉమ్మిడి కళ్యాణ్, వాసుపల్లి పరదేశి, వసంత, యనమరెడ్డి కుమార్ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, బూస రమణ రెడ్డి, పిలక మధుసూదన రెడ్డి, కోన కామేష్, బంగారు భవానీ శంకర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అప్పుఘర్ తీరంలో భక్తుల రద్దీ

- పోలీసు భద్రత నడుమ సముద్రస్నానాలు
- భక్తులతో ఎంవీపీ కాలనీ రోడ్లు కిటకిట

ఎంవీపీ కాలనీ: గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులతో అప్పుఘర్ తీరం పోటెత్తింది. భక్తుల పుణ్యస్నానాలతో తీరం కిటకిటలాడింది. అప్పన్న భక్తులు అత్యంత పవిత్రంగా భావించే 32 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణలోని ముఖ్యమైన ప్రాంతాల్లో అప్పుఘర్ ఒకటి కావడంతో ఇక్కడకు భారీగా తరలివచ్చారు. తెన్నేటి పార్కు మీదుగా అప్పుఘర్ తీరానికి చేరుకుని పెద్ద ఎత్తున సముద్రస్నానాలు ఆచరించారు. అనంతరం ప్రదక్షిణను తిరిగి కొనసాగించారు. భక్తుల అవసరాలకు అనుగుణంగా గత కొన్ని రోజులుగా ఇక్కడ ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. భక్తులు సముద్ర తీరానికి వెళ్లే దారిలో పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. పోలీసు సిబ్బంది, గజ ఈతగాళ్లు నిత్యం భక్తులను మైక్‌లలో అప్రమత్తం చేశారు. తీరంలో డ్రెస్సింగ్ రూమ్‌లు, మొబైల్ టాయిలెట్లు అందుబాటులో



భక్తులకు అల్పాహారం పంపిణీ చేస్తున్న విజయసాయి యోగ చారిటబుల్ ట్రస్ట్

ఉంచారు. 108, ఫైర్ సిబ్బందిని అందుబాటులో ఉంచారు. భక్తులకు అల్పాహారం, మంచినీరుతోపాటు పలు రకాల ఆహార పదార్థాలను స్వచ్ఛంద సంస్థలు పంపిణీ చేశాయి.

➡ విజయసాయి యోగ చారిబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అప్పుఘర్ తీరంలో భక్తులకు అల్పాహారం అందించారు. దీంతోపాటు వెంకోజీపాలెం కూడలి దరి ఎంవీపీ కాలనీ సెక్టార్ – 1లో శ్రీ లక్ష్మీనరసింహ



అప్పుఘర్ తీరంలో సముద్ర స్నానం చేస్తున్న భక్తులు



ఎంవీపీ కూడలి రోడ్డులో భక్తుల రద్దీ



భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న సభ్యులు



భక్తులకు టీ, నీరు అందిస్తున్న సభ్యులు

స్వామి గిరి ప్రదక్షిణ ప్రసాద పంపిణీ కమిటీ, శ్రీ వంశీకృష్ణ సేవా సమతి ఆధ్వర్యంలో అప్పన్న ఆలయ నమూనా, స్వామివారి విగ్రహం ఏర్పాటు చేయడంతో భక్తులు దర్శించుకున్నారు. దీంతోపాటు పెద్ద ఎత్తున ప్రసాదం పంపిణీ చేశారు. 22 రకాల అల్పాహారాలను రాత్రి 3 గంటల వరకు పంపిణీ చేసినట్లు కమిటీ ప్రతినిధి బ్యాంక్ శ్రీను తెలిపారు.

➡ వైఎస్సార్‌సీపీ 18వ వార్డు నాయకుల ఆధ్వర్యంలో టీ, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. భక్తుల రద్దీతో అప్పుఘర్ నుంచి వెంకోజీపాలెం వరకు ఎంవీపీ కాలనీలోని రహదారులు కిటకిటలాడాయి.

విమ్స్ కిటకిట



కన్సల్టెంట్స్ గదుల వద్ద రోగులు



ఓపీ వద్ద రోగుల రద్దీ

ఆరిలోవ: విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) రోగులతో కిటకిటలాడుతోంది. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు భారినపడుతున్న వారు విమ్స్‌ను ఆశ్రయిస్తున్నారు. వీరిలో కొద్ది రోజులుగా జ్వరాలు భారిన పడుతున్నవారు ఎక్కువగా ఉన్నారు. వారం రోజులుగా ఓపీ సుమారు 800 దాటుతుంది. జ్వరాలతో పాటు మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ బాధితులు నమోదవుతున్నారు. ఇక్కడ సాధారణ జ్వరాలతో పాటు డెంగ్యూ, మలేరియాతో బాధపడుతున్నవారు ఇటీవల ఇన్‌పేషెంట్లుగా చేరి చికిత్స పొందుతున్నారు. ఇక్కడ ఆర్థోపెడిక్, జనరల్, కార్డియాలజీ, ఈఎన్‌టీ తదితర వాటితోపాటు జ్వరాలతో వచ్చే రోగులతో రోజూ ఓపీ నమోదువుతుంది. జ్వరాలతో వెళ్లేవారికి రక్త పరీక్షలు నిర్వహించడంతో వారిలో మలేరియా, డెంగ్యూ జ్వరాలు సోకినట్లు వెల్లడవుతోంది. అలాంటివారు విమ్స్‌లో ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. రోజూ విమ్స్‌కు వస్తున్న వారిలో రక్త పరీక్షల అనంతరం 15 శాతంపైగా జ్వరాల బారిన పడినవారే ఉంటున్నారు.

జాతీయ సమ్మెకు వాల్తేర్ డిపో ఉద్యోగుల మద్దతు



వాల్తేర్ డిపో వద్ద నిరసనలో పాల్గొన్న ఉద్యోగులు

ఎంవీపీ కాలనీ : ఏపీఎస్ ఆర్టీసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన జాతీయ సమ్మెకు వాల్తేర్ డిపో ఉద్యోగులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం కాంట్రాక్ట్, హైయిర్ బస్ డ్రైవర్స్ నిరసన తెలిపారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు రూ.26 వేలు కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ జాతీయ సమ్మె నిర్వహిస్తున్నట్లు పలువురు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలన్నారు. 8 గంటల పని సమయాన్ని అమలు చేయాలని, 44 కార్మిక చట్టాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ జోనల్ కార్యదర్శి, ఎంసీహెచ్ అప్పడు, సీఐటీయూ మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వెంకటరావు, ఏపీఎస్ ఆర్టీసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డిపో అధ్యక్షుడు రఘు, అర్జున్, శివ, తదితరులు పాల్గొన్నారు.